తెరుచుకొని ప్రభుత్వ పాఠశాల

దమ్మనగర్‌లో మూసివేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

నార్నూర్ మండలం కొత్తపల్లి(హెచ్) గ్రామ పంచాయతీ పరిధిలోని దమ్మనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లల సంఖ్య లేదంటూ పాఠశాలను మూసివేశారు. పాఠశాలను తెరువకపోవడంతో దళిత పిల్లలు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారు. పాఠశాలను ప్రారంభించాలని విద్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆ గ్రామానికి చెందిన పిల్లలు కిలో మీటర్ల మేర కాలినడకన వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. కొందరు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పాఠశాలను తెరిపించేలా చర్యలు తీసుకోవాలని దళితులు కోరుతున్నారు.

-నార్నూర్, డిసెంబర్ 15

వరి నాట్ల కోసం ట్రాక్టర్‌తో కేజ్‌వీల్స్‌లో మడులను సిద్ధం చేస్తున్న రైతులు

జోరుగా వ్యవసాయ పనులు

ఖానాపూర్ మండలంలో యాసంగి వరి నాటు పనులు జోరుగా సాగుతున్నాయి. రైతులు ట్రాక్టర్ కేజ్‌వీల్స్ కొట్టించడంలో నిమగ్నమయ్యారు. ఆదివారం పట్టణ శివారులో యాసంగి వరి నాటు పనులు చేస్తూ కనిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన రైతు భరోసా కోసం ఎదురు చూపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యాసంగి పంటకైన సర్కారు రైతు భరోసా అందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

-ఖానాపూర్, డిసెంబర్ 15

ఇతరులకు ప్రవేశము లేదు

దస్తురాబాద్, డిసెంబర్ 15 : దస్తురాబాద్‌లోని కేజీబీవీ, బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో, మండలంలోని మల్లాపూర్ గొండు గూడెంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇతరులకు ప్రవేశము లేదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గతంలో నాయకులు, విద్యార్థి సంఘాలు వెళ్లే వారు కానీ ప్రస్తుతం హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్ అవుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. బయట వ్యక్తులు, సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు ఇలా ఎవరికి ప్రవేశం లేదంటూ ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తమ పిల్లలను చూడడానికి ప్రతి నెల రెండో ఆదివారం మాత్రమే విద్యార్థుల తల్లిదండ్రులకు అనుమతి ఇచ్చారు. అలాగే పిల్లలకు బయటి ఆహార పదార్థాలు, పచ్చళ్లు, కేకులు ఇవ్వద్దు అంటు ఫ్లెక్సీలో రాసి ఉంది.

దస్తురాబాద్ : ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

అల్ఫోర్స్‌లో మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 15: గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ సేవలు విశిష్టమైనవని గణిత శాస్త్రానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే గణితంపై మక్కువను పెంచుకోవాలని అన్నారు. నిర్మల్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులకు మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు 22వ తేదీన బహుమతులను అందజేస్తామని తెలిపారు.

భైంసాలో..

భైంసా, డిసెంబర్ 15 : భైంసాలోని అల్ఫోర్స్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ స్మారకార్థం మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఆరు తరగతి నుంచి పదో తరగతి వరకు 400 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రామానుజన్ చిన్నతనం నుంచే గణిత శాస్త్రంపై శ్రద్ధ చూపెడుతూ అనేక విషయాలను కనుగొని నూతన అధ్యాయాన్ని రచించారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకే గ్రామం నుంచి నలుగురు సైనికులు

సైన్యంలో చేరిన యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 15 : ఉట్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన నలుగురు యువకులు సైనిక ఉద్యోగాలకు ఎంపిక య్యారు. గ్రామానికి చెందిన తిత్రే జితేందర్, కటారే మేఘశ్యాం, బామన్ ధన్‌వీర్ సీఐఎస్ఎఫ్‌లో, జాడి మహేశ్ బీఎస్ఎఫ్‌లో ఎంపికయ్యారు. ఆదివారం గ్రామస్తులు వారిని శాలువాలతో సన్మానించారు. తమ గ్రామం నుంచి దేశ సేవకు యువకులు సైన్యంలో చేరడం ఎంతో గర్వకారణమని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని యువకులు ముందుకురావాలని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు తిత్రే సంతోష్, గోవింద్ పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

ఎదులాపురం,డిసెంబర్15: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఉన్నతంగా ఎదగాలని, వారికి అన్ని విధాలా అండగా నిలబడతామని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామంలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా అతిథులకు నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గండ్రత్ రమేశ్, జగదీశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజు, నాయకులు పరమేశ్వర్, రమణ, మోతీరాం, జంగు బాపు, అశోక్, ప్రకాశ్, సోము పటేల్ పాల్గొన్నారు.

మాజీమంత్రి జోగు రామన్నను సన్మానిస్తున్న క్రీడాకారులు

జైనథ్, డిసెంబర్ 15: బాలాపూర్ గ్రామంలోని దత్త ఆలయంలో మాజీమంత్రి జోగు రామన్న ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్సీ వసతి గృహం తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్ఐ సంజీవ్ కుమార్

ముథోల్, డిసెంబర్ 15 : ముథోల్‌లోని ఎస్సీ వసతి గృహాన్ని ఎస్ఐ సంజీవ్ కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజన సౌకర్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎస్సీ వసతి గృహ ప్రత్యేకాధికారి దేవేందర్, వార్డెన్ శారద ఉన్నారు.

వృద్ధులకు బ్లాంకెట్లు పంపిణీ

వృద్ధులకు బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ కింగ్స్ సభ్యులు

ఎదులాపురం, డిసెంబర్ 15 : ఆదిలాబాద్ గ్రామీణ ప్రాంతాల్లోని లింగుగూడలో లయన్స్ క్లబ్ కింగ్స్ అండ్ కాటన్ సిటీ ఆధ్వర్యంలో చలి బాధను భరించలేని వృద్ధులకు బ్లాంకెట్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సామయ్య, లయన్స్ క్లబ్ కింగ్స్ అధ్యక్షుడు పుప్పాల నరేందర్ కార్యదర్శి సత్యనారాయణ, కాటన్ సిటీ అధ్యక్షుడు గంగయ్య, కోశాధికారి రవీంద్ర, సీనియర్ లయన్లు రమాకాంత్ రావు, మధుసూదన్ రావు, బండారి దేవన్న, ప్రేమ్ రాజ్‌గౌడ్, దయానంద రెడ్డి, వయోవృద్ధుల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పూలాజీబాబా చూపిన బాటలో నడవాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్15: సద్గురు పూలాజీబాబా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం అంజి గ్రామంలో ఆంధ్ ఆదివాసీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్మించిన పూలాజీ బాబా ధ్యానకేంద్రం (ఆలయం) ప్రారంభించారు. అనంతరం పాత ధ్యానకేంద్రంలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో పూలాజీబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్‌గా ముకాడే ఉత్తమ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పూలాజీబాబా ధ్యానకేంద్రం అధ్యక్షుడు దశరథ్ గారోళే, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భైంసా, డిసెంబర్ 15 : దేగాం గ్రామంలో నిర్మించిన 40 డబుల్ బెడ్రూం ఇండ్లకు ఈ నెల 16, 17, 18 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయిలో అర్హులైన వారు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

అక్షర శ్రీకారాలు

బాసర, డిసెంబర్ 15 : బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పక్కనున్న మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ పిల్లలకు అక్షరశ్రీకార పూజలు నిర్వహించారు.

నేడు చలో ఐటీడీఏ ఉట్నూర్

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఉట్నూర్, డిసెంబర్ 15: నేడు చలో ఉట్నూర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొలాం సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు మాణిక్‌రావ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని ప్రెస్‌భవన్‌లో చలో ఐటీడీఏ ఉట్నూర్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలాంల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో దొంగతనాలు

ఉట్నూర్, డిసెంబర్ 15: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని బోయవాడలో నివాసముంటున్న రిటైర్డు ఉపాధ్యాయుడు కోరుట్ల రాములు ఇంట్లో, అలాగే కిషన్ బీడీ కంపనీ ఇంట్లో ఆదివారం ఉదయం దొంగతనాలు జరిగాయి. ఈ ఇండ్లకు సంబంధించిన యాజమానులు వివిధ కారణాలతో ఊర్లకు వెళ్లారు. ఆదివారం వచ్చి చూసే సరికి ఇండ్లకు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని యజమానులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం డాగ్ స్క్వాడ్‌తో పంచనామ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

పోరాటాల ఫలితమే బదిలీలు, ఉద్యోగోన్నతులు

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఎదులాపురం, డిసెంబర్ 15 : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ అలుపెరుగని పోరాటం సాగిస్తోందని వాటి ఫలితంగానే ప్రభుత్వం ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. ఆదిలాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ భవనంలో ఆదివారం టీఎస్ యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలు నిర్వహించారు. తొలుత అమరులైన సంఘం బాధ్యులు ఎం.కే దత్, బక్కన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ దేశ అక్షరాస్యత మెరుగుపడడం కాదని వందశాతం విద్యావంతులు అయినప్పుడే దేశ వికాసం సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ సమస్యల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల సందర్భంగా సంఘం పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిలు, కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ రావు, సురేఖ, జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకుమార్, కోశాధికారి కిష్టన్న, కార్యదర్శులు, వివిధ మండలాల బాధ్యులు, సంఘం పూర్వ బాధ్యులు, విశ్రాంత సీనియర్ ఉపాధ్యాయుడు దయాకర్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు జగన్‌మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాటి గురువులతో 2003-24 పదో తరగతి బృందం

ఉట్నూర్, డిసెంబర్ 15: ఉట్నూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-24 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు.

హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న అన్నారు. ఆదివారం నిర్మల్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో అమలుకు నోచుకొని హామీలను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమ జీవోను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

మాట్లాడుతున్న భరత్ చౌహాన్

ఉట్నూర్, డిసెంబర్ 15: ఏజెన్సీలోని గిరిజన, గిరిజనేతరులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు, లంబాడీ హక్కుపోరాట సమితి రాష్ట్రనాయకుడు భరత్ చౌహాన్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో 1970 సంవత్సరం కంటే ముందు నుంచి కాస్తులో ఉన్న గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఇందుకు ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరులకు పట్టాలు లేకపోవడంతో రుణమాఫీ కావడం లేదన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతరుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో శంకరయ్య, బండి నర్సయ్య, వీరయ్య, కొమురయ్య, శ్రీనివాస్, ముకుంద్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన విద్యార్థులు

ఎదులాపురం, డిసెంబర్ 15 : ఆదిలాబాద్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకుముఖి సైన్స్ సంబురాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలకు 33 జిల్లాల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరు కాగా ఆదివారం స్థానిక రిమ్స్ మెడికల్ కళాశాలను వారు సందర్శించారు. కళాశాలలోని సైన్స్ ప్రయోగశాలలోని పరికరాల గురించి ప్రొఫెసర్లు వారికి అవగాహన కల్పించారు.

17న పెన్షనర్స్ డే వేడుకలు

మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ఎదులాపురం, డిసెంబర్ 15 : ఆదిలాబాద్‌లోని టీఎన్జీవోస్ భవనంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షనర్స్ డే కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సభ్యులు భోజారెడ్డి, ఎస్ అశోక్, ఎస్ నరేందర్, టీ సుధీర్, లింగయ్య పాల్గొన్నారు.

ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ సభ్యుల ఎంపిక

సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ సాప పండరి

భైంసాటౌన్, డిసెంబర్ 15 : ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ ఆదేశానుసారం ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి మండలంలో పలువురికి నూతన సభ్యత్వ అనుమతి పత్రాలు ఆదివారం అందజేశారు. జిల్లా వైస్ చైర్మన్‌గా మాటేగాం గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ రావ్, భైంసా మండల జనరల్ సెక్రటరీగా కదం ఆకాశ్ పటేల్‌ను నియమించారు. కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ సింగ్, సాయికిరణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ, డిసెంబర్ 15 : మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన అల్లూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు అల్లూరి కార్తీక్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అక్కడికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి కలిసి ధైర్యం చెప్పి ఓదార్చారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్డి నిర్మాణాలు

వసతి గృహంలో కనీస సౌకర్యాల కరువు

తాంసి, డిసెంబర్ 15 : తాంసిలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహంలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదిగా అభివృద్ధి పనులు కొనసాగుతున్న ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు జరగడం లేదని ఆరోపణలు లేకపోలేదు. వసతి గృహంలో 117 మంది విద్యార్థులకు సరిపడా గదులు లేక తరగతి గదిలోనే రాత్రి పూట నిద్రించాల్సి వస్తుంది. మరుగుదొడ్ల నిర్మాణం నత్తనడకన సాగడంతో విద్యార్థులు శిథిలావస్థకు గురైన మరుగుదొడ్లను వినియోగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తరగతి గదిలోనే విద్యార్థులు నిద్రించడానికి ఏర్పాట్లు చేసిన బెడ్స్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసాటౌన్, డిసెంబర్ 15 : భైంసా మండలం గుండెగాం వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలకు వెళ్తే ...మండలంలోని మహగాం గ్రామానికి చెందిన ఎస్ బాలాజీ (48) ఆదివారం రాత్రి భైంసా నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. గుండెగాం వంతెనపై ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టడంతో బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

అమ్మానాన్నకు తోడుగా చిన్నారుల సమ్మె

నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, చిన్నారులు

ఎదులాపురం, డిసెంబర్ 15 : సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరుకున్నది. ఆదివారం సెలవు కావడంతో ఉద్యోగుల పిల్లలు వచ్చి రోజంత కూర్చొని మద్దతు తెలిపారు. సీఎం సారు వెంటనే స్పందించి న్యాయం చేయాలని చిన్నారులు కోరారు. వీరికి పలువురు మద్దతు తెలిపారు.